క్లుప్తంగా

19, 20న దస్తావేజు లేఖరుల పెన్ డౌన్

కంభం: దస్తావేజుల తయారీలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఈనెల 19, 20వ తేదీల్లో పెన్‌డౌన్ చేపట్టనున్నట్లు కంభం దస్తావేజుల లేఖరుల సంఘ అధ్యక్షుడు ఆకుల మురళి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ ఓటీపీ, స్థానిక సంస్థల డేటాబేస్ ఆధారంగా ఇంటి రిజిస్ట్రేషన్లు, కార్డ్ ప్రైమ్ సాఫ్ట్‌వేర్‌లోని సాంకేతిక లోపాల వల్ల దస్తావేజుల తయారీ జటిలమవుతూ తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. అటు ప్రజలు, ఇటు దస్తావేజు లేఖరుల సమయం వృథా అవుతున్నందున సదరు విధానాల్లో మార్పు అవసరమని ప్రభుత్వాన్ని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా దస్తావేజు లేఖరులు రెండు రోజులపాటు పెన్ డౌన్ చేసి నిరసన తెలుపుతున్నామన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈఓగా శ్రీనివాసరెడ్డి


బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసరెడ్డి

మార్కాపురం టౌన్: మార్కాపురం మండలంలోని అమ్మవారిపల్లి గ్రామంలో కొలువై ఉన్న యోగానంద లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఈఓగా జి.శ్రీనివాసరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆలయ ఈఓగా బాధ్యతలు స్వీకరించానని, ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈయన చెన్నకేశవస్వామి ఆలయ ఈఓగా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో విశ్వకర్మ పూజా మహోత్సవం


విశ్వకర్మ పూజామహోత్సవం నిర్వహిస్తున్న విశ్వబ్రాహ్మణులు

గిద్దలూరు రూరల్: విశ్వకర్మ జయంతి సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం నాయకుల ఆధ్వర్యంలో పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయం ఆవరణలో, తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో విశ్వకర్మ పూజా మహోత్సవాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవశిల్పిగా పేరొందిన విశ్వకర్మ ఎన్నో అద్భుతాలు సృష్టించారని, ఆయన విశిష్టతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు నాగసుబ్బరాయుడు, గోవింద ఆచారి, బాల బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పీఎంఏవై ఆవాస్ దివస్


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న మున్సిపల్, హౌసింగ్ అధికారులు

మార్కాపురం టౌన్: ప్రధానమంత్రి ఆవాస్ యోజన–అర్బన్ 2.0లో భాగంగా అంగీకార్–2025 బ్రోచర్‌ను మున్సిపల్ కమిషనర్, హౌసింగ్ అధికారులు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పీఎంఏవై ఆవాస్ దివస్ ప్రారంభించి సంవత్సరం పూర్తిచేసుకున్న సందర్భంగా పథకం ప్రయోజనాలు వివరించారు. పీఎం సూర్యఘర్‌పై అవగాహన కల్పించేందుకు ప్రచార కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్, హౌసింగ్ అధికారులు శ్రీనివాస్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ క్లినిక్ తనిఖీ


వైద్యశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఐవీఏ బృందం

గిద్దలూరు రూరల్: డబ్ల్యూహెచ్ఓ పర్యవేక్షణలో ఐవీఏ(ఇండిపెండెంట్ వెరిఫికేషన్ ఏజెన్సీ) బృంద సభ్యులు డాక్టర్ అజయ్ మిశ్రా, డాక్టర్ భార్గవి బుధవారం పట్టణంలోని కోటగడ్డ వీధిలో గల అర్బన్ హెల్త్ క్లినిక్ వైద్యశాలను తనిఖీ చేశారు. వైద్యశాలలోని ఓపీ, మందుల స్టాక్ రికార్డులు, ల్యాబ్‌లో పరికరాలను పరిశీలించారు. రోగులకు అందుబాటులో ఉంటూ నిరంతర సేవలు అందించాలని వైద్యుడు సూర్యచంద్రకు సూచించారు. అనంతరం కొమరోలులోని పీహెచ్‌సీని తనిఖీ చేశారు. వారి వెంట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హకీమ్, వైద్యారోగ్య సిబ్బంది రాధిక, భాను తదితరులు పాల్గొన్నారు.


కంభం గృహాల మధ్య నిరుయోగంగా ఉన్న ఫారెస్టు భవనంలో దుస్థితి


కంభంలో రోడ్డు పక్కన వ్యర్థాల్లో పందుల స్వైరవిహారం

పాలకుల పాపం.. జనానికి శాపం!


కంభం ప్రభుత్వ వైద్యశాలలో రక్త పరీక్షలు చేయించుకుంటున్న జ్వరపీడితులు


పిల్లల వార్డులో జ్వరబాధితులు

- గ్రామాల్లో నానాటికీ తీసికట్టుగా పారిశుధ్యం పరిస్థితి
- దోమల విజృంభణతో ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు
- కంభం ప్రభుత్వ వైద్యశాలకు క్యూ కడుతున్న రోగులు
- ఇన్ పేషెంట్లతో నిండిపోతున్న వార్డులు
- రోజూ ఓపీల సంఖ్య 300 దాటుతోందన్న వైద్య సిబ్బంది
- పల్లెల్లో కానరాని ఫీవర్ సర్వేలు, ప్రత్యేక మెడికల్ క్యాంపులు

కంభం:

గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా తయారవడం, అడపాదడపా కురుస్తున్న వర్షాలకు గ్రామాలు చిత్తడిగా మారుతుండటంతో దోమల ఉధృతి పెరిగిపోయి ప్రజలు, చిన్నారులు జ్వరాల బారిన పడుతున్నారు. కంభం బస్టాండ్ పరిసరాల్లోని దుకాణాల వ్యర్థాలను బస్టాండ్ వెనుక ఉన్న కాలువల్లో, రోడ్ల వెంట పడేస్తుండటంతో ఆ పరిసరాలు అధ్వానంగా మారిపోతున్నాయి. అర్బన్ కాలనీ, భాగ్యనగర్ కాలనీ, రావిపాడు రోడ్డు, వాసవీస్కూల్ వెనుకవైపు వీధుల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగు నిలిచిపోతోంది. ప్రజలు తమ గృహాల్లోని వ్యర్థాలను రోడ్ల వెంట, డ్రైనేజి కాలువల్లో పడేస్తుండటం దోమల ఉధృతికి కారణమవుతోంది. కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలోకి సమీప గృహాల వారు మురుగునీటిని వదిలేయడంతో పాటు చెత్తా చెదారం తెచ్చి పడేస్తున్నారు. గృహాల మధ్య నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు, ఖాళీ స్థలాల్లో సైతం చెత్తా చెదారం వేస్తుండటంతో పందులు స్వైర విహారం చేస్తున్నాయి.

కిటకిటలాడుతున్న కంభం వైద్యశాల

కంభం, అర్ధవీడు, బేస్తవారిపేట మండలాల నుంచి నిత్యం వందలాది మంది రోగులు, పిల్లలు కంభం ప్రభుత్వ వైద్యశాలకు వస్తున్నారు. ఓపీల సంఖ్య రోజుకు 300కు పైగా ఉంటోందని సిబ్బంది చెబుతున్నారు. అధికంగా విద్యార్థులు జ్వరాల భారినపడుతున్నట్లు తెలుస్తోంది. చిన్నారులు వైరల్ ఫీవర్, టైఫాయిడ్, డెంగీ లక్షణాలతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఇన్ పేషంట్లుగా చేరుతున్నారు.

కానరాని ఫీవర్ సర్వేలు

గత ప్రభుత్వ హాయంలో విలేజ్ క్లినిక్‌లలో పనిచేసే ఎంఎల్‌హెచ్‌పీలు, వైద్య సిబ్బంది, సీజనల్ వ్యాధులు ప్రబలే సమయంలో ఫీవర్ సర్వేలు, రక్త పరీక్షలు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు వైద్య సేవలందించే వారు. ప్రస్తుతం వారు విలేజ్ క్లినిక్‌లలో అందుబాటులో ఉండటమే గగనంగా మారింది. గ్రామాల్లో జ్వరాలు తీవ్ర స్థాయిలో ప్రబలుతున్నా వైద్యశాఖ ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. పారిశుధ్యంపై పంచాయతీ అధికారులు దృష్టి సారించకపోవడం, ఫాగింగ్ చేయకపోవడంతో దోమల బెడద రోజురోజుకూ తీవ్రమవుతోంది.

వైరల్ ఫీవర్ కేసులే అధికం



ఇటీవల కాలంలో వైరల్ ఫీవర్ కేసులు, డెంగీ లక్షణాల కేసులు అధికంగా వస్తున్నాయి. మూడు రోజుల వరకు జ్వరం తగ్గకుంటే ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి రక్త పరీక్షలు చేయించుకోవాలి. ఈ జ్వరం దోమల వల్ల వ్యాపిస్తున్నందున చుట్టుపక్కల పరిసరాల్లో చిల్లచెట్లు లేకుండా చూసుకోవాలి. మురుగు నిల్వ, నిరుపయోగంగా ఉన్న వస్తువుల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ శిరీషా ప్రియదర్శిని, కంభం ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్

ఉత్సాహంగా క్రీడల పోటీలు


పోటీలు ప్రారంభిస్తున్న ఎంఈఓ అబ్దుల్ సత్తార్

కంభం: క్రీడలు విద్యార్థుల్లో మానసిక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని ఎంఈఓ అబ్దుల్ సత్తార్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం మండల స్థాయి క్రీడల పోటీలను ఆయన ప్రారంభించారు. అండర్–14, అండర్–17 బ్యాడ్మింటన్ విభాగంలో కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని ఎంఈఓ పేర్కొన్నారు. కార్యక్రమంలో పీడీలు సుబ్రహ్మణ్యం, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

కొమరోలు: మండల స్థాయి టోర్నమెంట్ కం సెలక్షన్స్‌ను గురు, శుక్రవారాల్లో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ–2 బొర్రా వెంకటరత్నం తెలిపారు. గురువారం బాలురకు అండర్–14, 17 విభాగాల్లో, శుక్రవారం బాలికలకు అండర్–14, 17 విభాగాల్లో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆసక్తి ఉన్న బాలబాలికలకు క్రీడా మైదానానికి తీసుకురావాలని వ్యాయామ ఉపాధ్యాయులకు సూచించారు. క్రీడాపోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన బాలబాలికలను డివిజన్ స్థాయి టోర్నమెంట్‌కు పంపిస్తామన్నారు.

కొనకనమిట్ల మండలంలో..

కొనకనమిట్ల: మండల స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలను గురు, శుక్రవారాల్లో వెలుగొండలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు పెదారికట్ల, చినారికట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలల పీఈటీలు ఉప్పుటూరి శ్రీనివాసులు, సుఖునాభి, గురుకుల పాఠశాల పీఈటీ పెద్దన్న తెలిపారు. అండర్–14, 17 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల క్రీడాకారులను సంబంధిత పీఈటీ వెలుగొండ గురుకుల పాఠశాలకు తీసుకురావాలని సూచించారు.

విద్యార్థులు స్నేహభావంతో మెలగాలి

- డీఎస్పీ నాగరాజు


మాట్లాడుతున్న డీఎస్పీ నాగరాజు

మార్కాపురం టౌన్: విద్యార్థులు స్నేహభావంతో మెలగాలని డీఎస్పీ యు.నాగరాజు సూచించారు. బుధవారం స్థానిక జార్జి ఫార్మసి కళాశాలలో యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్ష ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. విద్యార్థులు ఇష్టంతో చదివి తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని ఆకాంక్షించారు. ర్యాగింగ్ వల్ల ఎదురయ్యే అనర్థాలు, సంబంధిత చట్టాల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సీఐ సుబ్బారావు, ఎస్సై రాజమోహన్‌రావు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ మండల నూతన కమిటీ ఎన్నిక


మాట్లాడుతున్న కౌన్సిలర్ శ్రీనివాసరావు

కొనకనమిట్ల: మండల ఏపీటీఎఫ్ నూతన కమిటీని బుధవారం కొనకనమిట్లలో నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర కౌన్సిలర్ కె.శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి వ్యవహరించారు. మండల అధ్యక్షుడిగా టి.రామారావు, మండల ప్రధాన కార్యదర్శిగా టి.యోగిరాములు, ఉపాధ్యక్షులుగా ఎం.కోటేశ్వరరావు, కె.పద్మజ, కార్యదర్శులుగా బి.శ్రీనివాసులు, ఎంవీ.నారాయణ, జి.తిరుతయ్య, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా టి.ఆదినారాయణ, సభ్యులుగా డీవీ మురళి, పి.శ్రీనివాసులు, కే హరినాథ్, ఎస్.శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులుగా సునీత, కె.మాల్యాద్రిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కె.తిరుమల, జిల్లా మాజీ కార్యదర్శి ఎస్కే ఖాదర్ బాషా, రాష్ట్ర మాజీ కౌన్సిలర్ టి.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నీటి తొట్ల నిర్వహణలో నిర్లక్ష్యం


గేదెలను నీటి తొట్టిలో దించి శుభ్రం చేస్తున్న వ్యక్తి

కంభం: పశువుల దాహార్తి తీర్చేందుకు జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన నీటి తొట్ల నిర్వహణపై పర్యవేక్షణ కొరవడింది. కందులాపురం పంచాయతీ పరిధిలోని జగనన్న లేఅవుట్ సమీపంలో పశువులను మేతకు తీసుకెళ్లిన వారు అక్కడ ఉన్న నీటి తొట్టిలోకి గేదెలను దించి శుభ్రం చేస్తున్నారు. దీంతో తాగునీరు మొత్తం మురుగుమయం అవుతున్నాయి. ఆ తర్వాత దప్పిక తీర్చుకునేందుకు వచ్చిన పశువులు మురుగునీటిని తాగేందుకు ఇష్టపడటం లేదు. పంచాయతీ సిబ్బంది నీటి తొట్లను పర్యవేక్షిస్తూ పశుపోషకులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

కరాటేలో జెడ్పీ బాలికల విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం శ్రీదేవీ, అధ్యాపకులు

మార్కాపురం టౌన్: మార్కాపురం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న పీవీ కౌసల్య అండర్ 17 కటా విభాగంలో ప్రథమ స్థానం, కుమితే విభాగంలో ద్వితీయ స్థానం పొందినట్లు పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి బుధవారం తెలిపారు. ఈనెల 16న ఒంగోలులో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి కరాటే పోటీల్లో అండర్–17 కుమితే విభాగంలో పీవీ కౌసల్య, సౌజన్య రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. అండర్ 14 విభాగంలో 8వ తరగతి విద్యార్థిని పిన్నిక వెంకట కల్యాణి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. పిన్నిక వెంకట కౌసల్య, వెంకట కల్యాణి ఇద్దరు అక్కాచెల్లెల్లు కావడం గమనార్హం. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులు హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. టోర్నమెంటు నిర్వాహకులు ప్రేమ్ ఖడ్గా, చంద్రశేఖర్, జగదీష్‌కుమార్ చేతుల మీదుగా ప్రశంస పత్రాలు, మెడల్స్ అందుకున్నట్లు తెలిపారు.


సబ్‌ట్రెజరీ కార్యాలయం ముందు నీటి మడుగు

ఉప ఖజానా కార్యాలయానికి దారేది?

పొదిలి: శకునం చెప్పే బల్లి కుడితిలో పడ్డట్లు అనే సామెత గుర్తుకొస్తుంది పొదిలి ఉపఖజానా కార్యాలయం పరిస్థితి చూస్తే. ఉద్యోగులు, కాంట్రాక్టర్లు, సర్పంచ్‌లు ఇంకా పలు రంగాల వ్యక్తులు తాము చేపట్టిన పనులకు బిల్లులు పొందాలంటే ఉప ఖజానా కార్యాలయానికి రావాలి. వర్షం కురిస్తే చాలు కార్యాలయ పరిసరాలు జలమయమవుతున్నాయి. తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో బ్రిటిష్ కాలం నాటి భవనంలో కొనసాగుతున్న ఈ కార్యాలయానికి రాకపోకలు సాగించేందుకు సరైన మార్గమే లేదు. రోడ్డు పక్కన ఉన్న గోడ పడగొట్టగా ఏర్పడిన దారినే ఉపయోగిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఉపఖజానా కార్యాలయం మార్గాన్ని సరిచేస్తారో లేదో వేచి చూడాల్సిందే.

డాక్టర్ శామ్యూల్ జార్జికి ఘన నివాళి


నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి సురేష్

మార్కాపురం: జార్జి విద్యా సంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ ఆదిమూలపు శామ్యూల్ జార్జి 19వ వర్ధంతి సందర్భంగా ఆయన తనయుడు, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు డాక్టర్ ఆదిమూలపు సురేష్ హైదరాబాద్‌లో తండ్రి చిత్రపటానికి, కళాశాల చైర్‌పర్సన్ జ్యోతీబాయితో కలిసి ఘనంగా నివాళులర్పించారు. తన తండ్రి ఆశయాలను కొనసాగిస్తానని మాజీ మంత్రి పేర్కొన్నారు.

వాహనదారులకు కౌన్సెలింగ్


వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ

గిద్దలూరు రూరల్: వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని స్థానిక సీఐ కె.సురేష్ పేర్కొన్నారు. పట్టణంలోని కుమ్మరాం కట్ట సెంటర్‌లో బుధవారం వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హెల్మెట్, సరైన పత్రాలు లేనివారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఓటర్ల పునఃపరిశీలనపై సమీక్ష


సూచనలిస్తున్న ఎస్‌డీసీ వెంకటరామిరెడ్డి

కంభం: ఓటర్ల పునఃపరిశీలన కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేక అధికారి వెంకటరామిరెడ్డి సూచించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల తహసీల్దార్లు, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్లు, ఎలక్షన్ కంప్యూటర్ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. 2002–2022 మధ్య ఓటర్ల జాబితా, ఎలక్షన్ ఇంటెన్సివ్ రివిజన్ తదితర అంశాలపై సూచనలిచ్చారు. కార్యక్రమంలో గిద్దలూరు మున్సిపల్ కమిషనర్ రమణబాబు, తహసీల్దార్లు వి.కిరణ్, జితేంద్ర, నాగార్జునరెడ్డి, భాగ్యలక్ష్మి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వేలం కేంద్రంలో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ

పొదిలి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం స్వచ్ఛతా హీ సేవ ప్రతిజ్ఞ చేశారు. ముందుగా వేలం అధికారి గిరిరాజ్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది పొగాకు వేలం కేంద్ర పరిసరాలను, కార్యాలయాన్ని శుభ్రం చేశారు. పరిశుభ్రతపై బోర్డు ఉద్యోగులు, రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు గిరిరాజ్‌కుమార్ చెప్పారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న ఏఎస్, సిబ్బంది

ఇంటి పన్ను ఆన్‌లైన్ సవరణకు అవకాశం

పొదిలి: నగర పంచాయతీ పరిధిలోని గృహ యజమానులు ఇంటి పన్నులకు సంబంధించి ఆన్‌లైన్‌లో సవరణలు చేయించుకోవాలని కమిషనర్ నారాయణరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. పొదిలి, కంభాలపాడు, నందిపాలెం, మాదాలవారిపాలెంలోని గృహాలకు సంబంధించి ఇంటిపన్ను ఆన్‌లైన్‌లో నమోదు కాకున్నా, పేరు, భర్త, తండ్రి పేరులో లేదా డోర్ నంబర్ తప్పు పడినా సవరణ కోసం సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో కార్యాలయంలో సంప్రదించాలని కమిషనర్ కోరారు.

ఆవాస్ దివస్‌పై అవగాహన కల్పించాలి


అంగీకార్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కమిషనర్, సిబ్బంది

గిద్దలూరు రూరల్: పీఎంఏవై ఆవాస్ దివస్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని స్థానిక నగర పంచాయతీ కమిషనర్ ఈవీ రమణబాబు పేర్కొన్నారు. పీఎంఏవై పథకం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో అంగీకార్ పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0 లో భాగంగా అంగీకార్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్నామన్నారు. ఉచిత విద్యుత్ యోజన, నూతన గృహ ప్రవేశాలు అంగీకార్ ద్వారా నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమలో హౌసింగ్ డీఈ ఖదీర్‌బాషా, ఏఈ మహేష్‌రెడ్డి, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.